# వెలి

నా ఆదర్శాలు, భావాలు ఎందుకో గానీ... ఎవరికీ నచ్చేవి కావు.

నేను మంచి కట్నం వచ్చే సంబంధం చేసుకుంటే చెల్లెలి పెళ్ళి కూడా చేయవచ్చని ఇంట్లోవాళ్ళు ఆశపడ్డారు. కానీ, తను ఆదర్శభావాలతో కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు. ఫలితంగా వాళ్ళు తనని వెలివేశారు.


పాతిక వేలు లంచం ఇస్తే వేలకొద్దీ పై ఆదాయం వచ్చే గొప్ప ఉద్యోగం తీసిస్తానని మామగారు చెప్పారు. వద్దని చిరుద్యోగంలో స్థిరపడినందుకు అత్తింటివాళ్ళు వెలివేశారు.

ఆఫీసులో లంచం తీసుకోకుండా పనిచేస్తున్నందుకు తోటి ఉద్యోగులు వెలివేశారు. ఆఫీసర్లకు అవసరమైన (ఆఫీసుకు అనవసరమైన) పనులు చేయనందుకు మేనేజ్‌మెంట్ నన్ను వెలివేసింది.

ఒక్క భార్యే నన్ను ఇంకా వెలివేయలేదు. అయితే, నా అసమర్థతను రోజుకో పది నిమిషాలన్నా నాకు గుర్తు చేయడం తన దినచర్యగా పెట్టుకుంది.

ఇన్ని చికాకుల్లోనూ నాకు ఆనందం కలిగించిన విషయం ఒక్కటే. నా కొడుకు బాగా చదువుకుని కెమికల్ ఇంజనీర్ అయ్యాడు. ఓరోజు తెలిసింది– అమెరికాలోని ఓ యూనివర్శిటీ ఇచ్చే 'యంగ్ సైంటిస్ట్' అవార్డుకు వాడు ఎన్నికయ్యాడని, త్వరలోనే అమెరికాలో సెటిల్ అవబోతున్నాడని, మొదటి వార్త నాకు అత్యంత ఆనందాన్ని, రెండో వార్త కాస్తంత విచారాన్ని తెచ్చిపెట్టింది.

నెలరోజుల తర్వాత వాడికి జరిగిన ఓ అభినందన సభకు నేనూ హాజరయ్యాను.



అనేకమంది విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలూ పాల్గొన్న ఆ సభలో రాష్ట్ర ఆర్థికమంత్రి ప్రసంగిస్తూ "తాను కనుగొన్న ఫార్ములాను తమకిస్తే లక్షల డాలర్లు ఇస్తామని విదేశాలు ఆశ చూపుతున్నా తన ప్రతిభ, సేవలు మాతృదేశానికి అంకితం చేయాలని నిర్ణయించుకున్న శ్రీ రామకృష్ణగారు మన రాష్ట్రానికీ, దేశానికీ గర్వకారణం అయ్యారు. ఆయనకు కావాల్సిన సహకారాన్ని నేను సంపూర్ణంగా అందిస్తానని హామీ ఇస్తున్నాను" అన్నారు.

నా ఆనందానికి అవధులు లేవు. 'వాడు నా కొడుకు' అని గర్వంగా అనుకుంటూ మావాళ్ళ వైపు చూశాను.

అందరూ తెల్లబోయి చూస్తున్నారు... నా భార్యతో సహా.

బహుశా మావాడిచ్చిన షాక్ నుంచి ఇంకా తేరుకోనట్లుంది వాళ్ళు.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 1 జూలై' 1999